సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం ı 6 ı జూలై ı 2023



'హోమ్'కు చిన్నారి తరలింపు

తప్పిపోయి నడిరోడ్డుపై ఏడుస్తున్న చిన్నారిని పోలీసులు అక్కున చేర్చుకున్నారు. ఆమె ఆకలి తీర్చి నెల్లూరులోని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60.460
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5.430
3 శాతం జీఎస్టీతో	రూ.5.593
సవర (8 గ్రా)	రూ.44.744

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 /28.5

మంగళవారంతో పోలిస్తే బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలిలో 53 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీ 98.74 శాతం పూర్తి



ఇందుకూరుపేట: పింఛన్ అందుకున్న గంగపట్నం వాసి బాషా సాహెబ్

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ ఐదురోజులపాటు జిల్లా వ్యాప్తంగా జరిగింది. బుధవారం నాటికి 3,04,686 మందికి గానూ 3,00,842 మంది లబ్ధిదారులు పింఛన్లు అందుకున్నారు. దీంతో 98.74 శాతం నమోదైంది.

పక్కాగా ఓటరు సవరణ, నమోదు

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ప్రత్యేక ఓటరు సవరణ, నమోదు కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్లో బుధవారం ఆయన ఈఆర్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా తప్పుల్లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఈనెల 20వ తేదీ నాటికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో బీఎల్‌ఓలకు, సూపర్‌వైజర్లకు శిక్షణా కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. అలాగే ఈనెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు నెలరోజులపాటు బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రం పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటరు సవరణ, నమోదు కార్యక్రమం నూటికి నూరుశాతం నిర్వహించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కుటుంబంలోని సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటర్లుగా ఉండేలా చూడాలని సూచించారు. ఈ విషయమై మున్సిపల్ ప్రాంతంలో ఉన్న ఈఆర్‌ఓలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. డెత్, షిఫ్ట్ మైగ్రేషన్, రిపీటెడ్ ఓటర్ తొలగింపు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏ కారణం చేత ఓటు తొలగించడం జరిగిందో సంబంధిత ఫైల్ కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో ఇప్పటి వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు సంబంధించి 7,399 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత ఈఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజల్లో ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

పోలీసులకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

నెల్లూరు(క్రైమ్): జిల్లా పోలీసు శాఖకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. గతేడాది నెల్లూరు రూరల్ మండలం కందమూరుకు చెందిన నారాయణ అనే వ్యక్తి ఆత్మహత్య కేసుకు సంబంధించి నివేదికను అందజేయాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ పోలీసు శాఖను ఆదేశించింది. నివేదిక జాప్యం కావడంతో ఆగస్టు 25న వ్యక్తిగతంగా హాజరుకావాలని లేనిపక్షంలో తుది నివేదికను అందజేయాలని ఆదేశించినట్లు తెలిసింది.

అపరాధ రుసుం లేకుండా పొగాకు కొనుగోలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): 2022–23 పంట కాలానికి సంబంధించిన రైతులు అధికంగా పండించిన వర్జీనియా పొగాకును ఎలాంటి అపరాధ రుసుం లేకుండా కొనుగోలు చేస్తారని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం నిర్వహణ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ, వాణిజ్య పరిశ్రమల శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. తమ అనధికార పొగాకు ఉత్పత్తుల వివరాలను రైతులు వేలం కేంద్రంలో అమ్ముకొనడానికి బోర్డు సూపర్‌వైజర్‌ను సంప్రదించి గురువారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. త్వరలోనే ఉత్పత్తులను వేలం కేంద్రాల్లో కొనుగోలు చేస్తామన్నారు.

యువత కలలపై విషపు రాతలు

నారంపేట పారిశ్రామికవాడపై ఈనాడు అబద్ధాలు

- నిధులు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 4.5 కిలోమీటర్ల మేర రోడ్డు
- రూ.12 కోట్లతో వివిధ నిర్మాణాలు
- గ్రీన్‌ల్యామ్ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు


ఆశల చూపులు.. ఇంకెన్నాళ్లో

పాతకులను మభ్యపెట్టడంలో ఈనాడు ఎప్పుడూ ముందుంటుంది. కళ్ల ముందు అభివృద్ధి కనిపిస్తున్నా ఏమీ జరగలేదని ఇష్టారీతిగా రాస్తుంది. దీనిపై ప్రజలు హర్షించరని తెలిసినా తన పంథా మార్చుకోదు. మంగళవారం నారంపేట పారిశ్రామికవాడపై అబద్ధాలను ప్రచురించింది. అక్కడ సదుపాయాలు కల్పించారు. పరిశ్రమల ఏర్పాటుకు అనేకమంది ముందుకొస్తున్నారు. అయితే కదలిక లేదని రాసి అప్రతిష్ట మూటగట్టుకుంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆత్మకూరు మండలంలోని నారంపేట పారిశ్రామికవాడ.. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల యువత దశాబ్దాల కల. దీనిని సాకారం చేసేందుకు ఈ ప్రభుత్వ హయాంలో దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ఆయన పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తొలి విడతలోనే ఇక్కడ మౌలిక వసతుల కల్పన కోసం రూ.28.8 కోట్లను విడుదల చేశారు. 2020 సంవత్సరం సెప్టెంబర్ 20వ తేదీన శిలాఫలకం వేసి టెండర్ ప్రక్రియ ద్వారా రెండు ఏజెన్సీలకు ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పనులు చేసే బాధ్యతలు అప్పగించారు. అయితే కరోనా మహమ్మారి కారణంగా పనులు మందగించాయి. గౌతమ్‌రెడ్డి అకాల మరణంతో కొంతకాలం పారిశ్రామికవాడ పనుల్లో కొంత స్తబ్ధత ఏర్పడింది. ఉప ఎన్నికల్లో గౌతమ్‌రెడ్డి సోదరుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి అఖండ మెజార్టీతో శాసనసభ్యుడిగా ఎన్నికయ్యాక పారిశ్రామికవాడ పనులు పునఃప్రారంభమై వేగం పుంజుకున్నాయి.

లబ్ధిదారుల హర్షం

పారిశ్రామికవాడ మొత్తం విస్తీర్ణం 172 ఎకరాలు. ఇప్పటి వరకు 4.5 కిలోమీటర్ల మేర రోడ్లు, 7 కిలోమీటర్ల మేర డ్రెయినేజీలు, 18 కల్వర్టులు తదితరాలను రూ.12 కోట్ల వ్యయంతో పూర్తి చేశారు. భూసేకరణ, పరిహారం పంపిణీ తదితర విషయాల్లో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన తీసుకున్న చర్యలపై భూములిచ్చిన లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. 74 ఎకరాల్లో ప్లాట్లు వేసి ఇప్పటికే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విక్రయించడానికి సిద్ధం చేశారు. మరో పది ఎకరాల్లో ఏపీఐఐసీ నిర్మాణాలు చేపట్టి విక్రయం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇవి కాకుండా మరో 62 ఎకరాల్లో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన విద్యుత్, నీరు తదితర సౌకర్యాలతో అందించేందుకు రూ.13 కోట్ల అంచనాలతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే మంజూరవుతాయని అధికారులు చెబుతున్నారు.



నారంపేట పారిశ్రామికవాడలో నాలుగు లేన్ల రోడ్డు



పారిశ్రామికవాడలో వేసిన శిలాఫలకం

త్వరలో గ్రీన్ ల్యామ్ పరిశ్రమ

త్వరలోనే నారంపేటలో గ్రీన్ ల్యామ్ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే విశాఖపట్నంలో జరిగిన సమ్మిట్‌లో పాల్గొని నారంపేట వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధిని వివరించడంతో గ్రీన్‌ల్యామ్ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. త్వరలోనే ఎంఓయూ కుదుర్చుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నీటి కోసం..

పారిశ్రామికవాడకు అవసరమైన నీటి వనరుల కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆత్మకూరు మండలం పాతజంగాలపల్లి నుంచి 20 కిలోమీటర్ల మేర పైపులైన్ల ద్వారా సోమశిల జలాలను తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. మూడు దశాబ్దాలుగా ఎన్నికల హామీలుగా మిగిలిపోయిన నారంపేట పారిశ్రామికవాడ ఈ నాలుగు సంవత్సరాల్లో అనేక ఒడిదొడుకులను ఎదుర్కొన్నా ప్రస్తుతం పనులు క్రమపద్ధతిలో జరుగుతున్నాయి.

వైఎస్ జగన్ పాలన దేశానికే దిక్సూచి



సభలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న సమన్వయకర్త రాజారెడ్డి

- 2024లో వైఎస్ జగన్ మళ్లీ సీఎం అవడం ఖాయం
- లోకేశ్, పవన్‌కు వ్యవసాయంపై అవగాహన లేదు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ఉదయగిరిలో ఘనంగా రాజారెడ్డి పరిచయ సభ

ఉదయగిరి: 'తెలుగుదేశం పార్టీపై రాష్ట్ర ప్రజలకు నమ్మకం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే దిక్సూచిగా నిలుస్తోంది. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మేకపాటి రాజగోపాల్‌రెడ్డి (రాజారెడ్డి) పరిచయ సభ బుధవారం ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగింది. దీనికి కాకాణి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఇటీవల ఎల్లో మీడియా, కొంతమంది వ్యక్తులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ టీడీపీ అధికారం చేపడుతుందని భ్రమలు కల్పిస్తున్నారన్నారు. కానీ ప్రజలు టీడీపీని నమ్మే పరిస్థితి లేదన్నారు. 2024లో మళ్లీ వైఎస్ జగన్ సీఎం అవడం ఖాయమన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పది నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. నమ్మించి మోసం చేయడం బాబు నైజమన్నారు. ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని మంత్రి అన్నారు.

రాజారెడ్డిని ఆశీర్వదించండి

మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్ట్‌కు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారని, దానిని ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నారన్నారు. మరో నాలుగైదు నెలల్లో పూర్తవుతుందన్నారు. దీంతో ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని 90 వేల ఎకరాల మెట్ట భూములు సస్యశ్యామలం అవుతాయన్నారు. 1983లో మొదటిసారిగా ఉదయగిరి నుంచే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయినా ఉదయగిరి ప్రాంతాన్ని విద్యాపరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశానన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల అభివృద్ధికి సీఎం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఉదయగిరిలో జరిగిన తప్పిదానికి నియోజకవర్గ ప్రజలను క్షమాపణ కోరుతున్నట్లు చెప్పారు. 2024 ఎన్నికల్లో మంచి మెజారిటీతో రాజారెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.



సభలో మాట్లాడుతున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

లోకేశ్, పవన్ కళ్యాణ్‌కు వ్యవసాయంపై అవగాహన లేదన్నారు. తాను పది పంటలను వారికి చూపిస్తానని, వాటిల్లో ఐదింటి పేర్లు చెబితే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. మేకపాటి కుటుంబంపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో అభిమానముందన్నారు. రాజారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి మేకపాటి కుటుంబం రుణం తీర్చుకోవాలన్నారు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల అభివృద్ధి మేకపాటి వారితోనే సాధ్యమన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు

విలువలకు, విశ్వసనీయతకు మారుపేరు వైఎస్ కుటుంబమని ఎమ్మెల్సీ మేరిగ మురళి అన్నారు. ఉదయగిరి సమన్వయకర్తగా రాజారెడ్డిని నియమించడం శుభపరిణామమని, వచ్చే ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధిస్తారన్నారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

మేకపాటి రాజారెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధితో తనకు భాగస్వామ్యం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 1983 నుంచి తన అన్న రాజమోహన్‌రెడ్డి రాజకీయ అడుగుజాడల్లోనే నడుస్తున్నట్లు చెప్పారు. ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలు సహకరించి తనను దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, జెడ్పీటీసీలు గణపం బాలకృష్ణారెడ్డి, లెక్కల లక్ష్మీకాంతమ్మ, పాలూరు మాల్యాద్రిరెడ్డి, కల్లూరు రమణారెడ్డి, రావిళ్ల నాగేంద్ర, ఎల్లాల వెంకట్రావు, మేదరమెట్ల శివలీల, మేకపాటి అభినయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏ విచారణకైనా సిద్ధం

- లోకేశ్‌కు నెల్లూరు ఎమ్మెల్యే అనిల్ సవాల్



మాట్లాడుతున్న అనిల్

నెల్లూరు(దర్గామిట్ట): 'తాను మంత్రిగా ఉన్నప్పుడు రూ.1,000 కోట్లు సంపాదించానని నారా లోకేశ్ ఆరోపించారు. దీనిపై ఏ విచారణకు నేను సిద్ధం. సిట్ లేదా సీబీఐ విచారణ వేయించాలి.' అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్ సవాల్ చేశారు. నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అక్రమాస్తులు సంపాదించానని చెబుతున్న లోకేశ్ తిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి ప్రమాణం చేయడానికి వస్తారా? అని ప్రశ్నించారు. రాజకీయాల్లోకి రాక ముందు నాకున్న ఆస్తిలో కంటే ఒక్క పైసా ఎక్కువ ఉన్నా భగవంతుడు తనను శిక్షిస్తాడన్నారు. గంజాయి తరలించే ముఠాకు తెలుగుదేశం పార్టీ నేతలే బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్నారని విమర్శించారు. లోకేశ్ నగరంలో పాదయాత్ర చేస్తూ తన తాత ఎన్టీఆర్ విగ్రహానికి కనీసం పూలమాల కూడా వేయలేదని, నందమూరి అభిమానులు దీనిపై ఆలోచించుకోవాలన్నారు. చెన్నైలో తాను నివాసం ఉంటున్న ఇల్లు బాడుగదని, అది తనదని చెప్పిన లోకేశ్ ఆ ఇంటిని ఇప్పించాలన్నారు. నగరంలో టీడీపీ సభ నిర్వహిస్తే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అజీజ్ ఎందుకు రాలేదో కార్యకర్తలకైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. లోకేశ్ కనీసం అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు.

లంచం అడిగి.. ఏసీబీకి చిక్కి..

- పొజిషన్ సర్టిఫికెట్ కోసం రైతుకు వేధింపులు
- చేజర్ల మండలంలో వీఆర్వో నిర్వాకం



వీఆర్వో రాజా

చేజర్ల: మండలంలోని కొలపనాయుడుపల్లి వీఆర్వో కొమ్మి రాజాను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇంటి పొజిషన్ సర్టిఫికెట్ కోసం రాజా చుట్టూ తిరిగి లంచం ఇవ్వలేక ఓ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం రాత్రి చేజర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు జరిగాయి. ఏసీబీ డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్ కథనం మేరకు.. కొలపనాయుడుపల్లి గ్రామానికి చెందిన గండపనేని శ్రీనివాసులు అనే రైతు జూన్ 30వ తేదీన హౌస్‌సైట్ పొజిషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రూ.7 వేలు లంచంగా ఇస్తే సర్టిఫికెట్ ఇస్తానని రాజా చెప్పాడు. లంచం ఇవ్వడం ఇష్టలేక శ్రీనివాసులు ఏసీబీని ఆశ్రయించారు. వారు రూ.7 వేలు రైతుకు అందించి వీఆర్వోకు ఇవ్వాలని చెప్పారు. బుధవారం రాత్రి శ్రీనివాసులు నగదు తీసుకుని చేజర్ల మండల తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న వీఆర్వో వద్దకు వెళ్లి నగదు అందించారు. వెంటనే ఏసీబీ అధికారులు దాడులు చేసి లంచం తీసుకున్న వీఆర్వోను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, రమేష్‌బాబు, వేణు, ఏఎస్‌ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

జనం లేక యువగళం వెలవెల

- కోవూరులో లోకేశ్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్
- పట్టించుకోని స్థానిక ప్రజలు
- దూరప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, ఆటోల్లో తరలింపు

కోవూరు: కోవూరులో నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయ్యింది. మూడురోజుల నుంచి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి వర్గాలు యువగళం యాత్రను విజయవంతం చేయాలని రకరకాల ప్రయత్నాలు చేశాయి. యాత్ర ప్రారంభానికి ముందే సాలుచింతల సెంటర్‌లో మంగళవారం రాత్రి ఫ్లెక్సీల వివాదం జరిగింది. లోకేశ్ యాత్ర బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు సాలుచింతల సెంటర్ వద్ద ప్రారంభమై నేతాజీనగర్, పడుగుపాడు, కోవూరు బజారు మీదుగా పాటూరు మార్గంలో సాగింది. పాదయాత్రను ప్రజలే కాదు అటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దగా పట్టించుకోలేదు. దీంతో అల్లూరు, కావలి, బోగోలు తదితర ప్రాంతాల నుంచి మొక్కుబడిగా ప్రజలను తీసుకొచ్చారు. అయితే వారు యాత్ర ప్రారంభానికి ముందే వెనుదిరిగారు. దీంతో యువగళం జనం లేక వెలవెలబోయింది.

వ్యాపారులు రాకపోవడంతో..

మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సమావేశం ఉంటుందని, రావాలని కోవూరు ప్రాంత వ్యాపారులకు టీడీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి. అయితే ఒక్క వ్యాపారి కూడా సమావేశం జరిగే సాలుచింతల విడిది కేంద్రం వద్దకు రాకపోవడంతో ఏం చేయాలో అర్థం కాక నాయకులు తలలు పట్టుకున్నారు. దీంతో పొరుగు నియోజకవర్గాల నుంచి వ్యాపారులను పిలిపించి సమావేశాన్ని ముగించారు. ఈ సమావేశంలో పలువురు విలేకరులు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ సమాధానాలు చెప్పలేకపోయారు. కాగా పోలంరెడ్డి, పెళ్లకూరు, చేజర్ల వర్గాల మధ్య ఉన్న వర్గపోరు మరోసారి వెలుగు చూసింది. లోకేశ్ ముందు బలప్రదర్శన చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసినా ప్రజల నుంచి మద్దతు లభించలేదు.



అల్లూరు నుంచి జనం తరలింపు



లోకేశ్ పాదయాత్ర మార్గంలో ఇదీ పరిస్థితి

సంక్షేమం వైపే మొగ్గు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాల హోరులో యువగళం కొట్టుకుపోయింది. ఇప్పటికే నియోజకవర్గంలో పేదలకు ట్రస్ట్ ద్వారా చేస్తున్న సాయం ప్రజల హృదయాల్లో నిలిచిపోయింది. టీడీపీ శ్రేణులు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు మాత్రం సంక్షేమం వైపే నిలబడ్డారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు చెబుతున్నాయి.

ఆశలు గల్లంతు

పాదయాత్రను విజయవంతం చేయాలని టీడీపీ పెద్దలు విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ వారి ఆశలు గల్లంతయ్యాయి. దూరప్రాంతాల నుంచి కూలీలను వాహనాల్లో తీసుకొచ్చారు. అయితే వారికి డబ్బులు ఇవ్వలేదు. అలాగే పట్టించుకోకపోవడంతో ద్వితీయ శ్రేణి నాయకులు డీలా పడిపోయారు. అలాగే నియోజకవర్గ నాయకులు యాత్రలో కనిపించలేదు. దీంతో లోకేశ్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కోలో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా ఒకటో యూనిట్లో 460 మెగావాట్లు, రెండో యూనిట్లో 280 మెగావాట్లు, మూడో యూనిట్లో 600 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని వెల్లడించారు.

సోమశిలలో 28.428 టీఎంసీలు

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 28.428 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 2,300, ఉత్తర కాలువకు 280, దక్షిణ కాలువకు 200 కండలేరుకు 50 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 91.132 మీటర్ల నీటి మట్టం ఉంది.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 132
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 228
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 254
లేయర్ చికెన్	: 178



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.26
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.5

అభాగ్యులకు ఆపన్నహస్తం



బాండ్లు అందుకున్న చిన్నారులతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : నిరాదరణకు గురైన, నిరుపేద చిన్నారులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఇందుకూరుపేటలో ఇటీవల ఐదు రోజుల పాటు ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిరాదరణకు గురైన 16 మంది చిన్నారుల గురించి తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన సత్యహర్షవర్ధన్, పార్థవి, సాత్విక, హర్ష, సుప్రియ, వెంకటేష్, నిత్య, ప్రజ్వల్, సాంసన్, విశాల్ మౌళి, సోనిత, వర్షిత, నాగ మల్లేశ్వరీలకు రూ.20 వేల చొప్పున అలాగే చందన, మైథిలి, బిందుశ్రీలకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.2.90 లక్షలను వారి పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఈ బాండ్లను ఆయా చిన్నారులకు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం ఇందుకూరుపేటలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు, నాయకులు గురజాల బుజ్జిబాబు, రవికుమార్, చక్రి, సర్పంచ్ పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.


'హోమ్'కు చిన్నారి తరలింపు

నెల్లూరు(క్రైమ్) : తప్పిపోయి నడిరోడ్డుపై ఏడుస్తున్న చిన్నారిని పోలీసులు అక్కున చేర్చుకున్నారు. ఆమె ఆకలి తీర్చి శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు నగరంలోని చాకలివీధిలో మహాలక్ష్మి ఆలయ సమీపంలో బుధవారం మూడేళ్ల చిన్నారి ఒంటరిగా ఏడుస్తుండటాన్ని స్థానికులు గమనించి 112కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తన సిబ్బందితో కలిసి హుటాహుటిన ఆలయం వద్దకు చేరుకుని ఏడుస్తున్న చిన్నారిని అక్కున చేర్చుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. పాప ఆకలితో ఉండటాన్ని గమనించి ఆమెకు టిఫిన్‌తో పాటు తినుబండారాలను తినిపించారు. అనంతరం తల్లిదండ్రులు ఎవరన్న విషయంపై ఆరాతీయగా చిన్నారి చెప్పలేకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించారు. ఎవరూ తమకు తెలియదని చెప్పడంతో చిన్నారిని రాజరాజేశ్వరి ఆలయ సమీపంలో ఉన్న శిశు సంరక్షణ కేంద్రంలో చేర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు సరైన ఆధారాలు చూపించి చిన్నారిని తీసుకువెళ్లవచ్చన్నారు.

జీవితంపై విరక్తితో వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నగరంలోని రామ్మూర్తినగర్ మూడో వీధిలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన బంగారు వ్యాపారి గురవయ్యకు ఇదివరకే వివాహమైంది. కొంతకాలం కిందట ఆయన రామ్మూర్తినగర్‌కు చెందిన రాజేశ్వరి(41)ని రెండో వివాహం చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. అతను హైదరాబాద్‌లో గ్రాఫిక్స్ డిజైనర్‌గా పని చేస్తున్నాడు. గురవయ్య మొదటి భార్య వద్దనే ఉంటూ అప్పుడప్పుడు రెండో భార్య వద్దకు వచ్చి వెళ్లేవాడు. దీంతో రాజేశ్వరి తన తల్లి సునీతతో కలిసి రామ్మూర్తినగర్ మూడో వీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. కొన్నేళ్లుగా రాజేశ్వరి ఫిట్స్‌తో బాధపడుతోంది. చిన్నచిన్న విషయాలకూ ఎక్కువగా ఆలోచించి అందరిపై కోప్పడుతూ ఉండేది. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రాజేశ్వరి తన బెడ్‌రూమ్‌లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనిని గమనించిన తల్లి సునీత చుట్టుపక్కల వారికి విషయాన్ని తెలియజేసింది. వారి సహాయంతో కుమార్తెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని నిర్ధారించారు. అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని సునీత బుధవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.సుమన్ ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

తండ్రి మందలించాడని..



రవిరెడ్డి (ఫైల్)

దుత్తలూరు : తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఏరుకొల్లులో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని ఏరుకొల్లుకు చెందిన జానకిరెడ్డి కుమారుడు కంచి రవిరెడ్డి (24) గూడూరులోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల బీటెక్ పూర్తిచేశాడు. ప్రస్తుతం ఇతను హైదరాబాద్‌లో ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. రెండ్రోజుల క్రితం స్వగ్రామం ఏరుకొల్లుకు వచ్చాడు. కళాశాలలో ఫీజు బకాయిలు ఉందని, సర్టిఫికెట్లు తెచ్చుకునేందుకు రూ.30 వేలు ఇవ్వాలని మంగళవారం తండ్రిని అడిగాడు. అయితే నగదు లేదని తండ్రి కోపగించుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన రవిరెడ్డి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. కాగా గ్రామ సమీప పొలాల్లోని బావిలో బుధవారం రవిరెడ్డి మృతదేహం తేలుతుండడంతో స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రభాకర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.